# పాతికేళ్ల పరిశోధకుడు



**ఒకప్పుడు...** తల్లిదండ్రులు పొలంలో కష్టపడుతుంటే పది కిలోమీటర్లు నడిచి వెళ్ళి చదువుకున్న కుర్రాడు..

**ఇప్పుడు...** విమానం ఎక్కి సియోల్ వెళ్ళి అంతర్జాతీయ అవార్డు అందుకున్న ఘనత సాధించాడు... ఈ రెండు దశల మధ్య అతడి పట్టుదల ఉంది! జీవితాన్ని తీర్చిదిద్దుకున్న కృషి ఉంది! ఎవరా కుర్రాడు.. ఏమా కథ?

పాతికేళ్ళ శ్రీనుబాబును చూస్తే అందరి కుర్రాళ్ళలాగే కనిపిస్తాడు. మాట్లాడి చూస్తే బాగా చదువుకున్న యువకుడిలా తోస్తాడు. అతడు రాసిన పరిశోధన పత్రాలు చూస్తే ఓ శాస్త్రవేత్త అనిపిస్తాడు. అతడి ఆలోచనలు చూస్తే మాత్రం 'కుర్రాడు మేధావే' అని ఒప్పేసుకుంటారు. అందుకనే శ్రీనుబాబు శ్రీకాకుళం జిల్లా నుంచి సియోల్ వరకు వెళ్ళగలిగాడు. అంతర్జాతీయ వేదిక మీద 'ఉత్తమ యువశాస్త్రవేత్త' అవార్డు పొందగలిగాడు. ప్రపంచ వ్యాప్తంగా ఈ అవార్డు పొందిన 25 మందిలో ఒకడిగా నిలవగలిగాడు. ఎప్పుడో పదేళ్ళ తర్వాత ఒక వ్యక్తికి మధుమేహ వ్యాధి వస్తుందని ముందుగానే కనిపెట్టగలిగితే ఎలా ఉంటుంది? దాన్ని నివారించుకునే సూచనలు ఇవ్వగలిగితే ఎలా ఉంటుంది? శ్రీనుబాబు చేసిన పరిశోధనల సారాంశం ఇదే. ఈ దిశగా కొన్ని ప్రోటీన్లను జీవ సూచికలు (బయోమార్కర్లు)గా ఆవిష్కరించటమే శ్రీనుబాబు సాధించిన ఘనత! ఈ ఆలోచనకి, విధానానికి త్వరలోనే మేధోపరమైన హక్కులు (పేటెంట్) కూడా లభించనున్నాయి.

శ్రీకాకుళం జిల్లా అల్లెన గ్రామంలో వ్యవసాయం చేసుకునే తల్లిదండ్రులు ఇరవై ఏళ్ళ క్రితం శ్రీనుబాబు చేత ఓనమాలు దిద్దించినప్పుడు అతడి బతుకును అతడు దిద్దుకుంటే చాల్లే అనుకున్నారు. ఆ మారుమూల బళ్ళో ప్రాథమికంగా చదువుకుని, ఆపై రోజూ పది కిలోమీటర్ల దూరం వెళ్ళి మరీ పదోతరగతి వరకు వచ్చిన శ్రీనుబాబు నమ్ముకున్నది ఒక్క చదువునే. అదే అతడిని ఇంతవరకు తీసుకొచ్చింది. ఇంటర్, బీఫార్మా, ఎంటెక్ అంటూ అంచెలంచెలుగా ఎదుగుతున్న కొడుకుని ఆంధ్రా యూనివర్శిటీలో పరిశోధక విద్యార్థిని చేయడానికి పొలాన్నే నమ్ముకున్న తండ్రి అప్పలనాయుడు, తల్లి యశోదమ్మ ఎంతో శ్రమపడ్డారు. వాళ్ళు కష్టపడి చదివిస్తే శ్రీనుబాబు ఇష్టపడి చదువుకుని ఇంతవాడయ్యాడు. ప్రస్తుతం 'జీవ సూచికలుగా ప్రోటీన్లు, మాస్ స్పెక్ట్రోమెట్రిక్ విశ్లేషణ' అంశంపై పిహెచ్.డి చేస్తున్నాడు.

కొరియా రాజధాని సియోల్ లో ఏషియా- ఓషియానియా హ్యూమన్ ప్రోటోమ్ ఆర్గనైజేషన్, కొరియా సొసైటీ ఆఫ్ మాస్ స్పెక్ట్రోమెట్రీ సంస్థలు ఏటా అంతర్జాతీయ స్థాయిలో కొత్త పరిశోధనలు చేసే ఉత్తమ యువ శాస్త్రవేత్తలను గుర్తించి పురస్కారాలు అందచేస్తుంటాయి. ఇందుకోసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న యువ శాస్త్రవేత్తల నుంచి వివిధ అంశాలపై పరిశోధన పత్రాలను ఆహ్వానిస్తాయి. ఇలా మొత్తం 1500 మంది పరిశోధన పత్రాలు పంపితే 25 మందిని ఎంపిక చేశారు. వారిలో మన దేశం నుంచి ఎంపికైన ఇద్దరిలో శ్రీనుబాబు ఒకడు. శ్రీనుబాబు అంతక్రితం కూడా ఎన్నో పరిశోధన పత్రాలు రాశాడు. ఇవన్నీ అంతర్జాతీయ గుర్తింపు ఉన్న సైన్స్ మ్యాగజైన్లలో 30 వరకూ ప్రచురితమయ్యాయి. శ్రీనుబాబుకి ఇంకా చాలా మంచి ఆలోచనలు ఉన్నాయి. 'ప్రమాదకరమైన కేన్సర్‌ను కూడా ముందుగానే గుర్తించే జీవ సూచికని కనిపెట్టాలన్నదే నా ప్రయత్నం' అంటాడితడు.

**- ఇలపావులూరి ప్రసాద్‌బాబు,** న్యూస్‌టుడే, విశాఖపట్నం